సన్నాహక సమావేశానికి తరలిన బీఆర్ఎస్ నేతలు

సమావేశంలో పాల్గొన్న అచ్చంపేట నేతలు

అచ్చంపేట, జనవరి 17: తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆధ్వర్యంలో అచ్చంపేట నేతలు తరలివెళ్లారు. అచ్చంపేట నియోజకవర్గంలోని అచ్చంపేట, లింగాల, బల్మూర్, అమ్రాబాద్, పదర, వంగూరు, ఉప్పునుంతల, చారగొండ మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ మండల అధ్యక్షులు, ముఖ్యనేతలు, నాయకులు తరలివెళ్లారు. ఈ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పాల్గొని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం కోసం దిశానిర్దేశం చేశారు.

నేడు గంధోత్సవం

పొల్కంపల్లిలో గంధోత్సవానికి సిద్ధమైన దర్గా

వంగూరు, జనవరి 17 : మండలంలోని పొల్కంపల్లిలో వెలిసిన హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ అజ్మీర్ దర్గా 6వ గంధోత్సవం నేడు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు నిజాముద్దీన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. అచ్చంపేట, వనపర్తి నుంచి దర్గా వద్దకు గంధాన్ని తీసుకువస్తారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వంశీకృష్ణతో పాటు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజులు హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు.

అప్పాజిపల్లి సర్పంచ్‌కు బీఎస్ఏ అవార్డు

తిరుపతమ్మకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

తిమ్మాజిపేట,జనవరి 17 : మండలంలోని అప్పాజిపల్లి సర్పంచ్ తిరుపతమ్మ బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్ఏ) అవార్డుకు ఎంపికైంది. బుధవారం ఆమెకు సంస్థ ప్రతినిధులు అవార్డు అందుకోవడానికి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో రాణిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీలకు బీఎస్ఏ అవార్డులు అందజేస్తుందన్నారు. అందులో భాగంగా అప్పాజిపల్లిని రాష్ట్ర స్థాయిలో ఉత్తమంగా నిలిపిన సర్పంచ్ తిరుపతమ్మకు ఆ సంస్థ అవార్డు ప్రకటించిందన్నారు. ఫిబ్రవరి 11వ తేదీన తిరుపతిలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆమెకు అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు. ఉత్తమసర్పంచ్‌గా ఎంపిక కావడంపై బీఆర్ఎస్ నాయకులు అభినందించారు.

8 కిలోల కణతి తొలగింపు

నాగర్‌కర్నూల్, జనవరి 17: మండలంలోని మంతటి గ్రామానికి చెందిన అలివేలమ్మ కడుపులో నుంచి బుధవారం 8కిలోల కణతిని తొలగించినట్లు డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య తెలిపారు. అలివేలమ్మ చాలా రోజులుగా కడుపునొప్పి, రక్తస్రావంతో బాధపడుతూ ఉండేదని, భరించలేని నొప్పితో దవాఖానలో చేరగా శస్త్ర చికిత్స ద్వారా దాదాపు 8 కిలోల కణతిని వెలికి తీసినట్లు సినట్లు తెలిపారు. శస్త్రచికిత్సలో వైద్యులు గైనకాలజిస్ట్ మాణిక్యాల మనీష, మాణిక్యాల, జనరల్ సర్జన్ అమిత్‌కుమార్, ప్రభు, రామకృష్ణారెడ్డి, రాము పాల్గొన్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల ప్రణాళికలు సిద్ధం చేయాలి

తాడూరు, జనవరి 17 : మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు, సర్పంచులు గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో గంగమోహన్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 19, 20 తేదీలో ఆయా శాఖల అధికారులతో గ్రామ సభలు నిర్వహించి ప్రజల సమక్షంలోనే అభివృద్ధి పనులను గుర్తించి తీర్మానించాలని తెలిపారు. సమావేశంలో ఎంపీవో లక్ష్మానాయక్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

హరిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

కల్వకుర్తి రూరల్, జనవరి17 : మండలంలోని గ్రామ గ్రామానా విరివిగా మొక్కలు నాటి గ్రామాలను హరిత గ్రామాలుగా తీర్చిదిద్దుదామని ఎంపీడీవో ఆంజనేయులు సూచించారు. బుధవారం మండలంలోని జీడిపల్లిలో పల్లెప్రకృతి వనాన్ని ఆయన సందర్శించారు. ఆయన వెంట ఎంపీవో దేవేందర్, ఏపీవో చంద్రసిద్ధార్థ, కార్యదర్శి ఉన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్, జనవరి 17: పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్‌పై ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించిన ఆరుగురు పోకిరీలపై కేసు నమోదు చేసినట్లు షీటీమ్ ఏఎస్సై విజయలక్ష్మి తెలిపారు. ఆమె కథనం మేరకు బుధవారం మినీ ట్యాంక్‌పై ఓ యువతితో కొందురు యువకులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు అందించిన సమాచారం మేరకు షీటీమ్ బృందంతో వెళ్లి తనిఖీ చేసి యువకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విజేతలకు బహుమతులు అందజేత

అచ్చంపేటరూరల్, జనవరి 17: మండలంలోని ఐనోల్ గ్రామంలో సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి బుధవారం స్థానిక నాయకుడు రమేశ్ నాయక్ సొంత ఖర్చులతో నగదు బహుమతితో పాటు షీల్డ్‌లు అందజేశారు.

కేపీఎల్ విజేత బీసీసీ

బల్మూరు, జనవరి 17: మండలంలోని కొండనాగుల గ్రామంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న కేపీఎల్ క్రికెట్ విజేతగా గంగాపుత్ర సంఘం భగవత్ క్రికెట్ కబ్లీ(బీసీసీ) విజేతగా నిలిచింది. బుధవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో బీసీసీ, డీఎస్‌టీ టీంలు తలపడగా భగవత్ క్రికెట్ కబ్లీ గెలుపొందగా రూ.50వేల నగదు, షీల్డు అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన డీఎస్‌టీకి రూ.30వేల నగదు, షీల్డును అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
★మహబూబ్‌నగర్ to నాగర్‌కర్నూల్ హైవే ఫేసింగ్ 300 ఎకరాల డిటిసిపి అప్రూవల్ లేఔట్‌లో 99 నెలల EMI ఫెసిలిటీ కలదు. Marketing Executives కావలెను. Cont: 9133399095
NT- 320376

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319415-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రభోత్సవం సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

- నేడు రథోత్సవం
- వేలాదిగా తరలిరానున్న భక్తులు

కొల్లాపూర్ రూరల్, జనవరి 17: మండలంలోని సింగోటం గ్రామంలో వెలిసిన లక్ష్మీ నారసింహాస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం గణపతి పూజ, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ ట్రస్టీ చైర్మన్ ఎస్వీకేకేబీ లక్ష్మారావు ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి స్వామివారికి ప్రభోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. రథోత్సవం తిలకించేందుకు తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయకమిటీ, ప్రభుత్వ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రథోత్సవం సందర్భంగా ఆలయం పరిసరాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సీఐ యాలాద్రి సిబ్బందితో కలిసి పార్కింగ్ స్థలాలను పరిశీలించారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి జూపల్లి పూజలు

కొల్లాపూర్ రూరల్, జనవరి 17:మండలంలోని రామాపురం గ్రామ సమీపంలోని గుట్టపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించి కోనేరు, ఆలయ అభివృద్ధిపై కమిటీతో చర్చించారు. మంత్రి వెంట మాజీ సర్పంచ్ బాలరాజు, రామస్వామి, రాము యాదవ్, హోటల్ చంద్రయ్య తదితరులు ఉన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మద్దిమడుగు పీఠాధిపతికి అయోధ్య నుంచి ఆహ్వానం

అచ్చంపేట, జనవరి 17: నల్లమలలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి పీఠాధిపతి, రామాంజనేయ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, హనుమాన్ మాలధారణ వ్యవస్థాపకుడు జయరాంగురుస్వామికి అయోధ్యలో ఈనెల 22న బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆహ్వానం అందింది. వీహెచ్‌పీ ప్రాంత ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ పుప్పాల వెంకటేశ్వర్‌రావు అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ప్రాణప్రతిష్ఠ ఆహ్వాన పత్రికను బుధవారం జయరాంగురుస్వామికి అందజేశారు. రామ మందిర ప్రారంభోత్సవానికి వివిధ రంగాల్లోని ప్రముఖులకు ఆహ్వానిస్తున్న విషయం తెలిసిందే. ఆహ్వానం మేరకు ఈ నెల 18న రాత్రికి హైదరాబాద్ నుంచి అయోధ్యకు వెళ్లనున్నట్లు జయరాంగురుస్వామి తెలిపారు. అయోధ్య నుంచి ఆహ్వానం రావడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన తెలిపారు.

శ్రీరాముడి అక్షింతల పంపిణీ

వంగూరు, జనవరి 17 : మండలంలోని తిప్పారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలను సర్పంచ్ శిరిషా ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ముందుగా అక్షింతలను ఎంతో భక్తిశ్రద్ధలతో గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భజనలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు యుగంధర్‌రావు, పర్వతాలుతో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానపత్రిక అందుకుంటున్న జయరాంగురుస్వామి

బ్రహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

బిజినేపల్లి, జనవరి 17: మండలంలోని పాలెం గ్రామంలోని అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 11 నుంచి 18 వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ శేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆలయప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వార్షిక బ్రహ్మోత్సవాల్లో సుమారు 500 మంది జంటలతో కల్యాణోత్సవం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 14న వెంకన్నస్వామి కల్యాణోత్సవం, 16న రథోత్సవం, 17న ఉద్దాలోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సురేందర్, బాలస్వామి, కుర్మయ్య, వెంకటేశ్వర్లు, నిఖిత, గోపాలస్వామి తదితరులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ దైవభక్తి పెంపొందించుకోవాలి

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు తీసుకెళ్తున్న గోళి శ్రీనివాస్‌రెడ్డి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్రనేత గోళి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ, జనవరి 17 : ప్రతిఒక్కరూ దైవభక్తి పెంపొందించుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్రనేత గోళి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెర్కూర్ గ్రామంలో ఈదమ్మ, మాందాత ఉత్సవాల్లో భాగంగా బుధవారం సవారమ్మ బోనాలు ఊరేగింపులో గోళి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు, నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింహ, మాజీ ఎంపీటీసీ భీమయ్యగౌడ్, మైసయ్య, నాయకులు అలీలొద్దీన్, సత్యం, శ్రీనునాయక్, ప్రశాంత్, రాంచందర్‌గౌడ్, లాలయ్య, అంబేద్కర్ సంఘం నాయకులు శ్రీను, నారాయణపూర్ సర్పంచ్ అంజినాయక్ ఉన్నారు.

భక్తులకు అసౌకర్యం కలిగించొద్దు

ప్రసాదం కౌంటర్ ను పరిశీలిస్తున్న చైర్మన్, ఈవో

అచ్చంపేట రూరల్, జనవరి 17: ఉమామహేశ్వరం బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలిగించొద్దని ఆలయ చైర్మన్ కంరూరు సుధాకర్, ఈవో శ్రీనివాసరావు ఆలయ సిబ్బందికి సూచించారు. బుధవారం వారు ఆలయ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కొబ్బరి కాయలు, దర్శనం టికెట్లు, ప్రసాదం కౌంటర్లను పరిశీలించారు. టెంకాయలు, ప్రసాదం ఆలయంలో తీర్మానించిన రేట్లకే విక్రయించాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అదనంగా తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేసి తాగునీరు, పారిశుధ్యం పనులు చేపట్టినట్లు తెలిపారు.

తాసీల్దార్‌కు సన్మానం

పెంట్లవెల్లి, జనవరి17 : పెంట్లవెల్లి మండల తాసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన హిందుమబిందును బుధవారం స్థానిక నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బచ్చు శ్రీను, కబీర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలించిన తాసీల్దార్

తిమ్మాజిపేట,జనవరి 17 : మండల కేంద్రంలోని 24,19 సర్వే నెంబర్లలోని స్థలాన్ని తాసీల్దార్ మోహన్ బుధవారం పరిశీలించారు. తమ కుటుంబ సభ్యుల సమాదిని తొలగించి షాపులు నిర్మించారని మండల కేంద్రానికి చెందిన శివనాగులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్ఐ,సర్వేయర్లతో కలిసి స్థలాన్ని పరిశీలించినట్లు తాసీల్దార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను కలెక్టర్,ఆర్డీవోకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

వైభవంగా సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం, జనవరి 17 : శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు, పూజలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం చండీశ్వరస్వామికి షోడశోపచార క్రతువులు నిర్వహించారు. అనంతరం ఆలయ ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో పెద్దిరాజు ఆధ్వర్యంలో రుద్రహోమ పూర్ణాహుతి, కళశోద్వాసన, త్రిశూలస్నానం, మహాదాశీర్వచన పూజలు నిర్వహించారు. మల్లికాగుండంలో వైదిక శాస్త్రోక్త అవబృధ స్నానం చేయించిన తరువాత వసంతోత్సవం నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు కల్యాణోత్సవం అనంతరం సాంప్రదాయం ప్రకారం పార్వతీదేవి అమ్మవారికి మెట్టెలు నల్లపూసలు సమర్పించే నాగవల్లి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వేదపండితులచే వేద పఠనం చేయించి పండితులను సన్మానించినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు.



యాగశాలలో పూర్ణాహుతి ప్రత్యేక పూజలు

అంతరాష్ట్ర బండ లాగుడు పోటీలు ప్రారంభం

కోడేరు, జనవరి 17: మండల కేంద్రం లోబుధవారం నిర్వహించిన అంతరాష్ట్ర బండ లాపోటీలను రాష్ట్ర పర్యాటక,ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లికృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో అంతరాష్ట్రబండ లాగుడుపోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. బెట్టింగులు లేకుండా రైతులను ఉత్సాహ పరిచేందుకే వృషభ రాజుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామ్మోహన్‌రావు, కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్‌కరీం, విండో డైరెక్టర్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీవోఈ కళాశాలలో చేరికకు దరఖాస్తుల ఆహ్వానం

కల్వకుర్తి, జనవరి 17 : తెలంగాణ గిరిజన గురుకుల విద్యాలయ సంస్థ నిర్వహిస్తున్న సీవోఈ కళాశాలలో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ సుజాత రావు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి ఫిబ్రవరి 5 లోపు ttwreiscoe.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అదేవిధంగా ఐటో తరగతి ప్రవేశాలకు ఈనెల 20 లోపు http://tgcet.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

కల్వకుర్తి, జనవరి 17 : నేడు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యాలయ నిర్వాహకులు తెలిపారు. యువకులు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

గ్యారెంటీలను అమలు చేయాలి

కల్వకుర్తి రూరల్, జనవరి 17 : మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలకు ఆరు గ్యారెంటీలు అందరికీ అమలు చేయాలని సమాచారం హక్కు చట్టం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి శేఖర్ ఎంపీడీవో ఆంజనేయులును కోరారు. ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికి అమలు చేయాలన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తాలుకా కార్యవర్గం ఎన్నిక

అచ్చంపేట, జనవరి 17: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకుల తాలుకా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం తాలుకా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా రవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విష్ణు, తాలూకా అధ్యక్షుడిగా మల్లయ్య, ప్రధానకార్యదర్శిగా పదర వెంకటేశ్, కోశాధికారిగా బొడ గణేశ్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్, సాయిలు, సహాయ కార్యదర్శులుగా నర్సింహ, రాధ, ప్రచారకార్యదర్శిగా చెన్నయ్య, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులుగా మురళి, నాగేందర్, రవి, వెంకటమ్మ, లలిత, కృష్ణయ్య, బోడియ, నరేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

తిమ్మాజిపేట, జనవరి 17 : మండలంలోని బాజీపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన వెంకటయ్య, రాములు,శాంతయ్య కుటుంబాలను గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పాండురంగారెడ్డి, వెంకట్ రెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఒక్కో కుటుంబానికి రూ.3వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట సర్పంచ్ బొందయ్య, గ్రామస్తులు మాసయ్య తదితరులు ఉన్నారు.

ఊర్కొండలో..

ఊర్కొండ, జనవరి17 : మండలంలోని ఊర్కొండపేట గ్రామానికి చెందిన సుక్కమ్మ కూతురు అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయాన్ని మాజీ సర్పంచ్ కృష్ణగౌడ్ ద్వారా తెలుసుకున్నా రాష్ట్ర బీఆఎస్ నాయకుడు జనార్దన్‌రెడ్డి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంటనే కుటుంబానికి రూ.6వేల ఆర్థికసాయం తన అనుచరుల ద్వారా అందజేశారు. అదేవిధంగా మోటానురం అంజనేయులు రూ.1000, ఎండీ నాసిర్‌కు రూ.1000 బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో యాదయ్యగౌడ్, రాములుగౌడ్, శేఖర్‌గౌడ్, రాముగౌడ్, అరవింద్‌గౌడ్, ఎండీ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం

కార్యక్రమంలో మాట్లాడుతున్న రఘువంశీ

- కేంద్రఆరోగ్యశాఖ జాయింట్ సెక్రటరీ రఘువంశీ
- చెర్కూర్, బర్కత్‌పల్లిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

వెల్దండ, జనవరి 17 : 2047 నాటికీ భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్నదే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కేంద్ర ఆరోగ్యశాఖ జాయింట్ సెక్రటరీ రఘువంశీ అన్నారు. మండలంలోని చెర్కూర్, బర్కత్‌పల్లిలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కేంద్ర పథకాల తో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా పరిశీలించి, వికసిత్‌భారత్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామాల సర్పంచులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రతిజ్ఞ ద్వారా ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పలు పథకాలపై సమీక్ష నిర్వహించారు. పథకాల అమలు, ఫలితాలపై ఆయా శాఖల అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలుతీరు బేషుగ్గా ఉన్నాయన్నారు. పథకాలను ప్రజలకు మరింత చేరువ కావల్సిన అవసరం ఉందని తెలిపారు. పథకాలను ప్రజల్లోకి తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపైన ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్యశాఖ ప్రతినిధి ప్రీతిబాల, డీఆర్‌డీవో పీడీ నర్సింగ్‌రావు, స్వరూప, సర్పంచులు రేవతి, బీరయ్య పాల్గొన్నారు.

వజ్రోత్సవాలకు తరలిరావాలి

బిజినేపల్లి, జనవరి 17: పాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 28న నిర్వహించనున్న వజ్రోత్సవాలకు వివిధ విద్యా సంస్థల పూర్వ విద్యార్థులు హాజరు కావాలని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బుడ్డయ్య, కార్యదర్శి మోహన్‌బాబు కోరారు. బుధవారం మండలంలోని పాలెం టీఎస్ఎం పాఠశాలలో వజ్రోత్సవ వేడుకల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1963 నుంచి 2023 వరకు పాలెం గ్రామంలోని విద్యా సంస్థల్లో చదివిన ప్రతి విద్యార్థి వజ్రోత్సవాలకు రావాలని కోరారు. సమావేశంలో బాలకిష్టయ్య, మల్లికార్జున్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీకాంత్, గోపాలస్వామి, సురేందర్, లక్ష్మీనారాయణ, హన్మంత్‌రావు, శేఖర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

వెల్దండ, జనవరి 17 : మండలంలోని చెర్కూర్ గ్రామంలో మూడు రోజులుగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి బైలునాటకం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు ప్రజలు ఎంతో ఉత్సాహంగా తరలివచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. కళాకారులు వివిధ రూపాల్లో వేసిన నాటకం ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నది. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నర్సింహ, మాజీ ఉపసర్పంచ్ గోపాల్‌నాయక్, నిర్వాహకులు అంజయ్య, దశరథంరెడ్డి, యాదయ్య, వెంకటాచారి, భిక్షపతిచారి పాల్గొన్నారు.